**11-12-2016 ఓంశాంతి మధువనం**

## నిమిత్త టీచర్లు మరియు సర్వ బ్రాహ్మణ కులభూషణులైన సోదరీ, సోదరులకు మధుర స్మృతి పత్రం

ప్రాణప్రియులైన అవ్యక్త బాప్‌దాదాకు అతి స్నేహీలు, సదా ఉల్లాస-ఉత్సాహాలనే రెక్కలతో ఎగిరే కల్పకల్పపు విజయీ ఆత్మలు, లైట్-మైట్ కల డబల్ కిరీటధారులు, సదా ముందుకు వెళ్ళేవారు మరియు ముందుకు తీసుకుపోయేవారు అయిన నిమిత్త టీచరు అక్కయ్యలు మరియు దేశ విదేశములలోని బ్రాహ్మణ కులభూషణులైన సోదరీ సోదరులందరికీ ఈశ్వరీయ స్నేహ సంపన్నమైన మధుర స్మృతులతో పాటు రాబోయే నూతన సంవత్సరమునకు అందరికీ చాలా చాలా హృదయపూర్వకమైన శుభ కామనలు, శుభాభినందనలు.

ఈ నూతన సంవత్సరము నూతన ఉల్లాస-ఉత్సాహాలను తీసుకుని సమీపంగా వస్తూ ఉంది. బాబా పిల్లలు నూతన సంవత్సర అభినందనలతో పాటుగా రాబోయే నూతన యుగానికి కూడా అందరికీ అభినందనలను ఇస్తారు. పిల్లలూ, వన్-వన్‌కు ముందే విన్ అయ్యే విజయమాలలోని విజయరత్నాలుగా అవ్వండి అని బాబా అంటారు. మీ మహానత ద్వారా సర్వ సిద్ధులను ప్రాప్తింప చేసుకోండి. ఎప్పుడైతే మీ సంకల్పాలు, మాటలు మరియు కర్మలు సిద్ధిని ప్రాప్తింప చేసుకుంటాయో అప్పుడు జయజయకారాలు జరుగుతాయి, ఇందుకొరకు ప్రతి సంకల్పము శుద్ధంగా మరియు శ్రేష్ఠంగా ఉండాలి. వ్యర్థము మరియు నెగటివ్‌ల చిహ్నాలు కూడా ఉండకూడదు. సదా శ్రేష్ఠ చింతన ద్వారా అందరి శుభచింతకులుగా అవ్వాలి కనుక ఈ నూతన సంవత్సరములో అందరూ సదా ఉత్సాహములో ఉంటాము మరియు అందరినీ ఉత్సాహములోకి తీసుకువస్తూ సదా ముందుకు వెళ్తాము మరియు అందరినీ ముందుకు తీసుకువెళ్తాము, ఇప్పుడు అన్ని రకాల కంప్లైంట్‌లను సమాప్తము చేసి స్వయమును కంప్లీట్‌గా తయారుచేసుకుంటాము అన్న ఈ విశేష కంకణాన్ని ధరించాలి.

చెప్పండి, మధురమైన బాబా ఇచ్చే ఈ సూచనలకు సాకారములో స్వరూపమును ఇస్తూ ఇప్పుడు విశ్వములోని మూల-మూలలలో పరమాత్మ ప్రత్యక్షతా జెండాను ఎగరవేయాలన్న శుభ సంకల్పము వస్తూ ఉంది కదా. ఎప్పుడైతే ఈ జయజయకారాల నినాదము మారుమ్రోగుతుందో అప్పుడు మన మధురమైన ఇల్లు మరియు మధురమైన రాజధాని సమీపంగా వస్తుంది.

ఇప్పుడు ఇంక వేరేవాటిని ఆలోచించే, మాట్లాడే అవసరమే లేదు. బాబా ఎంతటి సుఖాన్ని ఇచ్చారంటే వారి సమానంగా దాతగా తయారుచేసారు. నా అంతటి భాగ్యశాలిగా అందరూ అయిపోవాలి, వారి లోపల ఉన్న సంకల్పాలు, ఆశలు అన్నీ పూర్తయిపోవాలి, ఇచ్ఛామాత్రం అవిద్యగా సహజంగా అయిపోవాలి అని నాకు అనిపిస్తుంది. జీవితంలో ఏ ఆలోచనలు వచ్చినా అవి సేవ కొరకే ఉండాలి. సంకల్పాలలో కూడా అడిగే ప్రసక్తి ఉండకూడదు ఎందుకంటే అడగటము అనేది రాయల్టీ కాదు.

నా మనసులో అయితే ఎప్పుడూ ఈ పాటే మ్రోగుతూ ఉంటుంది - బాబా, మీరు నన్ను మీ వారిగా చేసుకుని నవ్వటాన్ని నేర్పించారు. బాబా వారిగా అయ్యి మొత్తము జీవితములో ఎడ్జస్ట్ అయ్యి నడిచాను. ఈ పని కష్టము అని ఎప్పుడూ అనలేదు. ఏ కష్టమూ లేకపోతే హాయిగా నవ్వండి. తెల్లని వస్త్రాలు, జేబులు ఖాళీ... కాని మొత్తము విశ్వ సేవను బాబా చేయించారు. అందరూ నా సోదరులు- సోదరీమణులు, సేవ కొరకు ఉన్నారు, సేవ తప్ప మరే ఇతర అటాచ్‌మెంట్ లేదు ఎందుకంటే మనము ఎవరము, ఎవరికి చెందినవారము అన్నది ఎల్లప్పుడు స్మృతిలో ఉంటుంది. ఇలా అనుకోవటములోని సంతోషము మరియు నషా చాలా ఉంటుంది, శాంతిగా ఉండే శక్తి లోపల ఉంది. శాంతిగా ఉండే అలవాటు ఎంత ఉంటే అంత మంచిది. ఎటువంటి చింతా లేదు, చింతనా లేదు. నాకు వ్యర్థమైన ఆలోచనలు రావు, కానీ మరెవ్వరికి కూడా వ్యర్థ ఆలోచనలు రాకూడదు అన్నది నా మనసులోని భావన. పరస్పరములో మన మధ్య ఉన్న సంబంధము ఏదైతే ఉందో అది చాలా సత్యమైన సుఖదాయకమైనది. ఇటువంటి ఈశ్వరీయ సంబంధము మొత్తము కల్పములో ఉండదు.

నేను ఏం సేవ చేస్తున్నాను అని నన్ను నేను ప్రశ్నించుకుంటాను. కేవలము టెన్షన్ నుండి ఫ్రీగా ఉండే అటెన్షన్ ఉంది. ఏ విషయమునకు చెందిన టెన్షన్ లేదు. బాబా ఎంతటి సింపుల్ లైఫ్ స్టైల్‌ని తయారుచేసారంటే ఒకరినొకరు చూసుకుంటూ అంటు నాటుకుంది, మంచి పూలతోట తయారైంది. అందరినీ చూస్తుంటే ఇది పుష్పాల తోటలా అనిపిస్తుంది... కమలపుష్పము నీటిలో ఉన్నా కూడా అతీతముగా ఉంటుంది, గులాబీ పువ్వుకూడా అద్భుతమైనది. అన్ని పూలూ ఒకేలా ఉండవు, సైజ్‌లో, రంగులో తేడా ఉంటుంది, అయినా సుగంధము ఉంటుంది. గులాబీపువ్వు కింద ఒకవేళ ఏదైనా ముల్లు ఉన్నట్లయితే దానిని తీసేస్తారు. అది దోషి కాదు, బాబా ఈ తోటను తయారుచేసారు, ఈ తోటలో మీరందరూ సుగంధభరితమైన పుష్పాలు. ఎల్లప్పుడూ మీ ఆత్మికత అనే సుగంధాన్ని వ్యాపింపచేస్తూ, నిశ్చింతస్థితికి చెందిన వాయుమండలాన్ని తయారుచేస్తూ వెళ్లండి. అచ్ఛా - అందరికీ చాలా చాలా హృదయపూర్వక ప్రియస్మృతులు.

***ఈశ్వరీయ సేవలో బి.కె. జానకి దాది.***

# తపస్వీమూర్తులుగా అవ్వండి

1. తపస్వి అనగా సదా బాబా లగనములో లవలీనులై, ప్రేమ సాగరములో ఇమిడిపోయి, జ్ఞానము, ఆనందము, సుఖము, శాంతుల సాగరములో ఇమిడిపోయి ఉండేవారినే తపస్వీమూర్తి అని అంటారు. కనుక అందరూ ఈ అనుభవములో ఇమిడిపోండి.
2. తపస్సు అనగా లగనములో మగనమై, విశేషంగా మనసు-బుద్ధిల ఏకాగ్రత ద్వారా అవ్యక్త వతనంలో విహరించండి. నడుస్తూ-తిరుగుతూ, భోజనం చేస్తూ కూడా ఒక్కరి స్మృతిలో, ఒక్కరి తోటే భోజనాన్ని స్వీకరించటము - ఇది కూడా తపస్సే.
3. బ్రహ్మాబాబా సంస్కారములలో, ప్రతి సంకల్పములో బేహద్ కళ్యాణము ఎలా అవుతుంది అన్నదే ఉండేది. అలా బేహద్ కళ్యాణ భావనను ఉంచుకుని తపస్వీమూర్తులుగా అవ్వండి. ప్రతి క్షణము తపస్యా స్వరూపము, తపస్వీమూర్తి. మీ మూర్తి మరియు ముఖము ద్వారా త్యాగము, తపస్సు మరియు సేవలను సాకారరూపములో ప్రత్యక్షము చెయ్యండి.
4. మేము శాంతి కిరణాలను, శక్తి కిరణాలను విశ్వములో వ్యాపింపచెయ్యాలి, తపస్వీమూర్తులుగా అయ్యి ఉండాలి అన్న సంకల్పమునే ప్రతి ఒక్కరూ తీసుకోండి. ఇప్పుడు ఇతరులను వాణి ద్వారా సావధానులుగా చేసేందుకు బదులుగా మనసా శుభభావన ద్వారా ఒకరికొకరు సహయోగులుగా అయ్యి ముందుకు వెళ్ళండి మరియు ముందుకు తీసుకువెళ్ళండి.
5. స్థూల అగ్ని లేదా ప్రకాశము మరియు వేడి దూరము నుండే ఎలా కనిపిస్తాయో, అనుభవమవుతాయో అలా మీ తపస్సు మరియు త్యాగముల మెరుపు దూరము నుండే ఆకర్షితము చెయ్యాలి. ప్రతి కర్మలో త్యాగము మరియు తపస్సు ప్రత్యక్షంగా కనిపించాలి, అప్పుడే సేవలో సఫలతను పొందగలరు.
6. మీ మస్తకము అనగా బుద్ధి యొక్క స్మృతి మరియు దృష్టి ద్వారా ఆత్మిక స్వరూపమే కనిపించాలి. భృకుటి మధ్యలో దివ్య సితార మెరుస్తూ ఉండాలి. ప్రతి ఆత్మ పట్ల కళ్యాణ సంకల్పము మరియు భావన ఉండాలి, మరే ఇతర భావన ఉత్పన్నమవ్వకూడదు.
7. తపస్సు చేసేవారు ఏ విధంగా ఆసనముపై కూర్చుంటారో అలా మీరు మీ ఏకరస ఆత్మిక స్థితి అనే ఆసనముపై విరాజమానులై తపస్సు చెయ్యండి. మీ ప్రతి కర్మేంద్రియము నుండి దేహ-అభిమానము యొక్క త్యాగము మరియు ఆత్మ-అభిమానము యొక్క తపస్సు ప్రత్యక్ష రూపములో కనిపించాలి.
8. మీ తపస్వీ స్వరూపము ద్వారా మీలో మిగిలిపోయిన వికర్మలను భస్మము చెయ్యండి, ప్రతి ఆత్మ యొక్క తమోగుణీ సంస్కారాలను మరియు ప్రకృతి యొక్క తమోగుణమును భస్మము చేసేందుకు శక్తిని ఇచ్చే సేవను చెయ్యండి. చిత్రాలలో శంకరుని ఏ విధముగా తపస్వీమూర్తిగా చూపిస్తారో అలా ఏకరస స్థితి అనే ఆసనముపై స్థితులై మీ తపస్యా రూపమును ప్రత్యక్షంగా చూపించండి.
9. తపస్వులు వృక్షము క్రింద కూర్చుని తపస్సు చేస్తారు. మీరు కూడా ఈ సృష్టి రూపీ వృక్షము కింద వేర్ల దగ్గర కూర్చుని తపస్సు చేస్తున్నారు. వృక్షము క్రింద కూర్చోవటం ద్వారా మొత్తము వృక్షము యొక్క జ్ఞానము బుద్ధిలోకి వస్తుంది. కనుక నాలెడ్జ్‌ఫుల్‌గా అయ్యి మొత్తము వృక్షమునకు శక్తులనే జలాన్ని ఇవ్వండి.
10. ఈ వృక్షముపై కూర్చుని మేము మొత్తము వృక్షమును చూస్తున్నాము అని మొదట్లో ఎలా నషా ఉండేదో అలా పరంధామపు ఉన్నత స్థితిలో కూర్చుని కింద పూర్తి విశ్వానికి శక్తిని ఇచ్చే సేవ చెయ్యండి. దీని వలన తపస్సు మరియు సేవ రెండూ కంబైండ్‌గా మరియు ఒకేసారి అవుతాయి.

11. సమయ సమీపత ప్రమాణంగా ఇప్పుడు సత్యమైన తపస్వీలుగా అవ్వండి. మీ సత్యమైన తపస్సు మరియు సాధన ఉన్నదే బేహద్ వైరాగ్యం. ఇప్పుడు బేహద్ వైరాగ్య వృత్తి ద్వారా నలువైపుల తపస్సు యొక్క వాయుమండలమును తయారుచెయ్యండి. మీ తపస్సు మనసాసేవకు నిమిత్తమవుతుంది.

12. తపస్వీమూర్తి అనగా - తపస్సు ద్వారా శాంతి, శక్తి కిరణాలు నలువైపుల వ్యాపిస్తున్నట్లు అనుభవములోకి రావాలి. ఈ తపస్వీ స్వరూపము ఇతరులకు ఇచ్చే స్వరూపము. సూర్యుడు ఏ విధంగా విశ్వమునకు ప్రకాశమును ఇస్తాడో, అనేక వినాశీ ప్రాప్తుల అనుభూతిని కలిగిస్తాడో అలా మహా తపస్వీ ఆత్మలారా, మాస్టర్ జ్ఞానసూర్యులుగా అయ్యి శక్తిశాలీ కిరణాల అనుభూతిని చేయించండి.

13. ఇప్పుడు జ్వాలాముఖులుగా అయ్యి ఆసురీ సంస్కారాలు, స్వభావాలన్నింటినీ భస్మము చెయ్యండి. జ్వాల ద్వారా అసురులను సంహరించినట్లుగా దేవతల స్మృతిచిహ్నాలలో చూపిస్తారు. ఇది మీ జ్వాలాస్వరూప స్థితికి స్మృతిచిహ్నము. ఇప్పుడు మీరు ఎటువంటి యోగ జ్వాలను ప్రజ్వలితము చెయ్యాలంటే దీనిలో ఈ కలియుగ ప్రపంచము జ్వలించి భస్మమైపోవాలి.

14. ఇప్పుడు వినాశనమైపోవాలి అని దుఃఖిత ఆత్మల మనసులలో ఈ మాట ఎలా మొదలైందో, అలా విశ్వ కళ్యాణకారీ ఆత్మలైన మీ మనసులో ఇప్పుడు త్వరగా అందరి కళ్యాణము జరగాలి అన్న సంకల్పము ఉత్పన్నమవ్వాలి, అప్పుడే సమాప్తి జరుగుతుంది.

15. సూర్య కిరణాలు ఏవిధంగా వ్యాపిస్తాయో మాస్టర్ సర్వ శక్తివంతుల స్థితిలో స్థితులై సర్వశక్తులు మరియు సర్వ విశేషతల రూపీ కిరణాలను నలువైపుల వ్యాపింపచేస్తున్నట్లుగా అనుభవము చెయ్యండి. "నేను మాస్టర్ సర్వ శక్తివంతుడను, విఘ్నవినాశక ఆత్మను', ఈ స్వమానము యొక్క స్మృతి సీట్‌పై స్థితులవ్వండి.

16. ఇప్పుడు జ్వాలారూపులుగా అయ్యే దృఢసంకల్పము చెయ్యండి మరియు సంగఠిత రూపములో మనసు-బుద్ధిల ఏకాగ్రత ద్వారా పవర్‌ఫుల్ తపస్సు యొక్క వైబ్రేషన్‌లను నలువైపుల వ్యాపింపచెయ్యండి. ఇప్పుడు తిరిగి ఇంటికి వెళ్ళాలి అన్న ఈ చింత లోపల ఎల్లప్పుడు ఉండాలి. వెళ్ళటము అనగా సర్వ సంబంధాల నుండి, ప్రకృతి యొక్క ఆకర్షణ నుండి ఉపరామముగా అనగా సాక్షిగా అవ్వండి.

17. తపస్వీ స్వరూపపు ఆసనముపై కూర్చుని మీ శ్రేష్ఠ యశస్సు, ఆత్మిక యశస్సు యొక్క స్థితిలో స్థితులై ఇప్పుడు లోకులను వ్యాకులపరిచే పరిస్థితులను సమాప్తము చెయ్యండి. మీ స్థితి ద్వారా వ్యాకుల ఆత్మలకు శాంతి మరియు మనశ్శాంతుల వరదానమును ఇవ్వండి. లైట్‌హౌస్ మరియు మైట్‌హౌస్ స్థితులను తెలుసుకుంటూ, ఆ స్వరూపములో స్థితులవ్వండి.

18. విశేషంగా జ్ఞానస్వరూప స్థితిలో స్థితులై స్మృతియాత్రను శక్తిశాలిగా తయారుచెయ్యండి. మీ శుభ వృత్తి మరియు కళ్యాణ వృత్తి మరియు శక్తిశాలీ వాతావరణము ద్వారా తపిస్తున్న, భ్రమిస్తున్న, పిలుస్తున్న అనేక ఆత్మలకు ఆనందము, శాంతి మరియు శక్తుల అనుభూతిని చేయించండి.

19. సంగఠిత రూపములో జ్వాలాస్వరూప స్మృతిని అభ్యాసము చెయ్యండి. ప్రతి ఒక్కరూ చైతన్య లైట్‌హౌస్‌లుగా అయ్యి కూర్చోండి. సేవాధారులు, స్నేహీలు, ఒకే బలము-ఒకే విశ్వాసము కలవారు... ఇదైతే మంచిదే, కానీ ఇప్పుడు మాస్టర్ సర్వ శక్తివంతుల స్థితిని స్టేజ్‌పైకి తీసుకురండి.

20. కోటలో ప్రజలు సురక్షితంగా ఉంటారు. రాజు కొరకు చిన్న గదిని తయారుచెయ్యరు, కోటను తయారుచేస్తారు. మీరందరూ స్వయము కొరకు, సహచరుల కొరకు, ఇతర ఆత్మల కొరకు జ్వాలారూపపు స్మృతి అనే కోటను తయారుచెయ్యండి. మీ తపస్వీ స్వరూపము ద్వారా స్మృతిని జ్వాలారూపముగా శక్తిశాలిగా తయారుచెయ్యండి, ప్రతి ఆత్మ తమ సురక్షతను అనుభవం చేసుకోవాలి.

21. జ్వాలా స్వరూపపు స్మృతి ద్వారా పాపకటేశ్వరులుగా లేక పాపహరులుగా అవ్వండి. మీ స్మృతి ఎంతటి శక్తిశాలీ తపస్వీ స్వరూపముదిగా ఉండాలంటే అనేక ఆత్మల నిర్బలత దూరమైపోవాలి. ఇందుకొరకు ప్రతి క్షణము, ప్రతి శ్వాసలో బాబా మరియు మీరు కంబైండ్‌గా అయ్యి ఉండండి. స్నేహము మరియు శక్తి, రెండు  కంబైండ్‌గా ఉండాలి.

22. ఇప్పుడు నిర్భయులు, జ్వాలాముఖులుగా అయ్యి మీ తపస్వీ స్వరూపము ద్వారా ప్రకృతి మరియు ఆత్మలలో ఉన్న తమోగుణమును భస్మము చెయ్యండి. తపస్సు అనగా జ్వాలా స్వరూప స్మృతి, ఈ స్మృతి ద్వారానే మాయ మరియు ప్రకృతిల భయంకర రూపము శీతలమవుతుంది. మీ మూడవ నేత్రము, జ్వాలాముఖి నేత్రము మాయను శక్తిహీనంగా తయారుచేస్తుంది.

23. తపస్వీమూర్తులుగా అయ్యేందుకు మనసు మరియు బుద్ధి, రెండింటికీ పవర్‌ఫుల్ బ్రేక్‌ను ఇవ్వండి, తోడుతోడుగా మలుచుకునే శక్తిని ధారణ చెయ్యండి, దీని వలన బుద్ధి శక్తి మరియు ఎటువంటి ఎనర్జీ వేస్ట్ అవ్వకుండా జమ అవతుంది, ఇందుకొరకు విశేషంగా సర్దుకునే శక్తిని ధారణ చెయ్యండి.

24. మీ తపస్వీరూపము ద్వారా, యోగాగ్ని ద్వారా ఈ పాత వృక్షమును భస్మము చేసే మరియు పరివర్తన చేసే సంకల్పము చెయ్యండి. ఇందుకొరకు సంగఠిత రూపములో ఫుల్‌ఫోర్స్‌తో యోగజ్వాలను ప్రజ్వలితము చెయ్యండి. ఏకరస స్థితి అనే ఆసనముపై ఏకాగ్రచిత్తులై కూర్చోండి. ఒక్కరి స్మృతిలోనే మునిగిపోండి.

25. సమయప్రమాణంగా ఇప్పుడు మీ తపస్వీ రూపము ద్వారా నలువైపుల శక్తిని ఇచ్చే,  వైబ్రేషన్‌లను ఇచ్చే, మనసు ద్వారా వాయుమండలమును తయారుచేసే కార్యము చెయ్యండి. ఇప్పుడు ఈ సేవ యొక్క ఆవశ్యకత ఉంది, ఎందుకంటే చాలా నాజూకు సమయము  వస్తోంది.

26. తపస్వీ స్వరూపములో కూర్చుని మీ ఎగిరే కళ ద్వారా ఫరిస్తాలుగా అయ్యి నలువైపుల పరిక్రమణ చెయ్యండి మరియు శాంతి కావాలన్నవారికి శాంతిని, సంతోషం కావాలన్న వారికి సంతోషాన్ని, సంతుష్టత కావాలన్న వారికి సంతుష్టతను మీ ఫరిస్తా రూపములో వారికి అనుభూతి చేయించండి. .

27. అంతఃవాహక అనగా అంతిమ స్థితి, పవర్‌ఫుల్ స్థితే మీ అంతిమ వాహనము. మీరు ఆ స్వరూపమును ఎదురుగా ఇమర్జ్ చేసుకుని మూడు లోకాలను తిరగండి. మీ దయాహృదయ తపస్వీ స్వరూపము ద్వారా వ్యాకుల ఆత్మలకు సర్వ శక్తుల సకాష్‌ను ఇవ్వండి.

28. ఈ దేహ ప్రపంచములో ఏం జరుగుతున్నా కానీ మీరు సాక్షిగా అయ్యి అందరి పాత్రను చూస్తూ మీ తపస్వీ స్వరూపము ద్వారా శక్తిని ఇస్తూ ఉండండి. ఉన్నతస్థితిలో స్థితులై శక్తిని ఇచ్చినట్లయితే ఏ రకమైన వాతావరణపు వేడి తగలదు.

29. బాబా ఏవిధంగా అవ్యక్త వతనములో, ఒక స్థానములో కూర్చుని విశ్వములో నలువైపుల ఉన్న పిల్లల పాలనను చేస్తున్నారో అలా మీరు కూడా ఒక్క స్థానములో కూర్చుని మీ తపస్వీ స్వరూపము ద్వారా బేహద్దు సేవను చెయ్యండి. బేహద్దులో సకాష్‌ను ఇవ్వండి.

30. ఆదిరత్నాలైన మీరు బ్రాహ్మణులు, విశేషంగా ఈ వృక్షమునకు కాండము వంటివారు.  బలహీనులకు శక్తిని ఇవ్వండి. మీ పురుషార్థపు సమయాన్ని ఇతరులకు సహయోగమును ఇవ్వటంలో వెచ్చించండి. .

31. జ్ఞాన మననముతో పాటు శుభ భావన, శుభకామనల సంకల్పమును, శక్తిని ఇచ్చే అభ్యాసమును, మనసు మౌనమును, ట్రాఫిక్ కంట్రోల్ సమయమును నిశ్చితము చేసుకోండి. విశేషంగా ఏకాంతవాసి మరియు ఖజానాల ఎకానమీ యొక్క ప్రోగ్రామ్‌ను తయారుచెయ్యండి. మీ తపస్వీ స్వరూపము ద్వారా సేవ  చెయ్యండి.